విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శుక్రవారం 21 నవంబరు 2025 8 పేజీలు

తిరుమలకు చేరుకున్న భారత రాష్ట్రపతి

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: శ్రీవారి దర్శనార్థం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం సాయంత్రం తిరుమల చేరుకున్నారు. తిరుమలలోని శ్రీ పద్మావతి విశ్రాంతి గృహం వద్దకు చేరుకున్న ఆమెకు ఆంధ్రప్రదేశ్ హెూంశాఖ మంత్రి వంగలపూడి అనిత, టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, జానకీ దేవి, భానుప్రకాశ్ రెడ్డి, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి పుష్పగుచ్ఛాలు అందించి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు జిల్లా ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై
పద్మావతి అమ్మవారు

విశాలాంధ్ర-తిరుపతి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన గురువారం రాత్రి హనుమంత వాహనంపై శ్రీ పట్టాభిరాముని అలంకారంలో శ్రీ పద్మావతి అమ్మవారు భక్తులకు అభయమి చ్చారు. హనుమంతుడు శ్రీరామచంద్రునికి అనన్యభక్తుడు. త్రేతాయుగంలో శ్రీవారు శ్రీరాముడిగా అవతరించారు. ఆదిలక్ష్మి సీతగా మిథిలానగరంలో అవతరించి, స్వామిని వివాహమాడింది. భూదేవి అంశ అయిన వేదవతి కలియుగంలో పద్మావతిగా అవతరించింది. తన జాడను శ్రీవారికి తెలిపిన మహాభక్తుడైన ఆంజనేయుని కోరికను తీర్చడానికా అన్నట్టు అలమేలుమంగ బ్రహ్మోత్సవాలలో హనుమంతున్ని వాహనంగా చేసుకుంది. వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జెఈఓ వి.వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, అర్చకులు బాబుస్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భక్తులను తప్పుదోవ పట్టించే సంస్థలకు విరాళాలు ఇవ్వవద్దు

భక్తులకు టీటీడీ చైర్మన్ విజ్ఞప్తి

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: భక్తులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్న సంస్థలకు ఎట్టి పరిస్థితుల్లోనూ విరాళం ఇవ్వవద్దని శ్రీవారి భక్తులకు టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు విజ్ఞప్తి చేశారు. గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్, savetemples.org పేర్లతో వ్యవహరిస్తున్న కొందరు వ్యక్తులు తిరుమల, తిరుపతి, తిరుచానూరు ప్రాంతాలను పుణ్యక్షేత్రాలుగా ప్రకటించేందుకు నవంబర్ 29న ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తప్పుడు ప్రచారం చేస్తూ మోసపూరిత చర్యలతో విరాళాలు సేకరించేందుకు భక్తులను తప్పుదారి పట్టిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ విధమైన అనుమానాస్పద సంస్థలకు విరాళాలు ఇవ్వకుండా, వారి వలలో పడకుండా భక్తులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తిరుమల పవిత్రతను కాపాడేందుకు, భక్తుల విశ్వాసం నిలబెట్టేందుకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు.

సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణకు ఘన స్వాగతం

విశాలాంధ్ర-తిరుపతి: పంజాబ్ రాష్ట్రం చండీగఢ్ లో జరిగిన జాతీయ మహాసభల్లో సిపిఐ జాతీయ కార్యదర్శి గా ఎన్నికైన తర్వాత తొలిసారిగా తిరుపతికి వచ్చిన సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. తిరుపతి కి ఆయన ఓ ప్రైవేట్ కార్యక్రమం కు వచ్చినట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి తెలిపారు. గురువారం సాయంత్రం తిరుచానూరు రోడ్డు శిల్పారామం ఎదురుగా ఉన్న పిఎస్4 హెూటల్ వద్ద సిపిఐ కార్యకర్తలు జాతీయ కార్యదర్శి రామకృష్ణకి శాలువా కప్పి పూల బోకె ఇచ్చి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య కే.రాధాకృష్ణ ఎన్.చంద్రశేఖర్ రెడ్డి ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎన్ డి రవి, పై ఎస్ మణి, మహేంద్ర, రైల్వే బాల, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్తుకు ప్రోత్సాహం

- శాంతిపురం మండలంలో సోలార్ ప్లాంట్ పనులు వేగవంతం

- ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి

విశాలాంధ్ర-తిరుపతి: రాష్ట్ర ముఖ్యమంత్రి నియోజకవర్గ మైన కుప్పం పరిధిలో సోలార్ విద్యుత్తు వినియో గాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టామని ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివ శంకర్ లోతేటి కోరారు. కుప్పం నియోజకవర్గం పరిధిలోని శాంతిపురం మండలం, అబకలదొడ్డి గ్రామంలో ఎస్సీ/ఎస్టీ వినియోగదారులకు ఏర్పాటు చేసిన రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ను, బల్లా వద్ద నిర్మాణ దశలో ఉన్న 33/11 కెవి సబ్-స్టేషన్ ను, సోలార్ ప్లాంట్ పనులను సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్- ఐటీ) పి.అయూబ్ ఖాన్, చిత్తూరు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఇస్మాయిల్ అహ్మద్ లతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిఎండి శివశంకర్ లోతేటి అబకలదొడ్డి గ్రామంలో సోలార్ విద్యుత్తు వినియోగదారులు శ్రీరాములు, పద్మావతి, వెంకటమునిలతో మాట్లాడి రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్ పనితీరు, వివరాలను తెలుసుకున్నారు. గృహాలకు సోలార్ సిస్టమ్ ఏర్పాటు పనుల పట్ల వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్ ను ఏర్పాటు చేసుకునేందుకు వినియోగదారులు ముందుకు రావడం ఆనందదాయకమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రెండు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానల్స్ ద్వారా రోజుకి 8 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని, తద్వారా వినియోగదారులు విద్యుత్ బిల్లును ఆదా చేయవచ్చని సూచించారు. అనంతరం బల్లా వద్ద ఏర్పాటు చేస్తున్న 33/11 కెవి సబ్-స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి, సబ్-స్టేషన్ ను ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత బల్లా వద్ద పీఎం-కుసుమ్ పథకం కింద ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ పనుల్లో భాగంగా 4.9 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్లాంటు పనులను పరిశీలించారు. సోలార్ ప్లాంట్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్లాంట్ ద్వారా రైతులకు మరింత నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ఈ ప్రాంతంలో విద్యుత్ ఉత్పత్తి కోసం గాలి మరల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుప్పం రెస్కో మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. సోమశేఖర్, ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమిష్టిగా వ్యాధులను నియంత్రిద్దాం: సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటయ్య

విశాలాంధ్ర-రేణిగుంట: సమిష్టిగా వ్యాధులను నియంత్రిద్దామని సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటయ్య గురువారం కరకంబాడి ప్రాథమిక పాఠశాల నందు విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనం కు ముందు ఆ తర్వాత చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలి అన్నారు. వాతావరణంలో మార్పు వచ్చింది కాబట్టి కాచి వడబోతున్న నీళ్లను తాగాలన్నారు. అలాగే వేడి ఆహార పదార్థాలు మాత్రమే తీసుకోవాలన్నారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తీసుకురాదన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురికి నీళ్లు నిలువ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు మురికి నీళ్లు నిలువ ఉంటే దోమలు ఉత్పత్తి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని అవగాహన కల్పించాలని సూచించారు. ఐదు రోజుల నుంచి నీళ్లు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. వారంలో ఒకరోజు" డ్రై డే ఫ్రైడే "కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రజలకుఅవగాహన కల్పించాలన్నారు. కాచి వడపోసిన నీళ్లు మాత్రమే తాగాలని తెలియజేయాలన్నారు. దోమల నివారణకు దోమతెరలు వాడాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్య, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కానీ, విలేజ్ హెల్త్ క్లినిక్ వచ్చి ఆరోగ్య పరీక్షలు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం తో పాటు ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుచానూరులో ఉచిత కంటి చికిత్స శిబిరం

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: శంకరా నేత్రాలయ చెన్నై, మంజుల మంగపూడి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్స శిబిరం తిరుచానూరు ఎన్నారై ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో ప్రారంభమైంది. నవంబర్ 20 నుంచి 26 వరకు జరుగుతున్న ఈ శిబిరంలో స్థానికులకు ఉచిత కంటి పరీక్షలు, కళ్లద్దాలు, అవసరమైన మందులు అందజేస్తున్నారు. కంటి శుక్లం (క్యాటరాక్ట్) తో బాధపడుతున్న రోగులకు ప్రత్యేక సేవలుగా నవంబర్ 24 నుంచి 28 వరకు శంకరా నేత్రాలయ మొబైల్ సర్జికల్ యూనిట్ ద్వారా పూర్తిగా ఉచిత శస్త్రచికిత్సలు అందించనున్నారు. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు మందులు వాడుతున్న వారు వాటిని వెంట తెచ్చుకోవాలని, ఆధార్ కార్డు తప్పనిసరి అని వైద్య బృందం స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో చంద్రమౌళిరెడ్డి, తేజస్విని, నరసింహారెడ్డి, శ్రీనివాసులు, శంకరా నేత్రాలయ ప్రతినిధులు రంజిత్, ఆల్బర్ట్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ అధ్యక్షులుగా చెంచయ్య నాయుడు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులుగా రంగినేని చెంచయ్య నాయుడును నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యక్షులుగా ఎం.గంగిరెడ్డి... సభ్యులుగా సామ అంకయ్య, కె.మాధవరెడ్డి, దాసరి చలపతి, ఎర్రి రమేష్, వై.చంద్రవతి, కె.భాగ్యలక్ష్మి, ఏ.రేష్మా, గాలి భూలక్ష్మి, కంద్రిగ జయకుమారి, ఎం.సునిత, ఎస్ కే మహమ్మద్ షఫి, మందల యానాదయ్య, హేక్ హమీదాను నియమించారు. ఈ కమిటీకి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గౌరవ అధ్యక్షులుగా వ్యవహరించనున్నారు. ఏడాది పాటు మార్కెట్ కమిటీ కార్యవర్గం ఉంటుంది.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-చౌడేపల్లి, మండలంలోని గ్రంథాలయం నందు గురువారం, 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో చివరి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు మరియు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల యందు వ్యాసరచన డ్రాయింగ్ మరియు పాటల పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధాన ఉపాధ్యాయులుచే ప్రధానం చేయడమైనది

తిరుమలలో అన్య మత చిహ్నం స్టిక్కర్‌తో వాహనం

డ్రైవర్, యజమానిపై కేసు నమోదు

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఎచీ-31-బాజు-4073 వాహనంపై అన్య మతానికి చెందిన చిహ్నం స్టిక్కర్ అతికించబడి సదరు వాహనము తిరుమల కొండ పై ఉన్న విషయం గుర్తించబడింది. గురువారం ఉదయం 10.40 గంటల సమయంలో అలిపిరి చెక్‌పోస్ట్ వద్ద ఈ వాహనం 9 వ లేన్ గుండా వచ్చినప్పటికీ, అక్కడ విధుల్లో ఉన్న సిటి-5949 వి.వాసు బాబు (9వ లేన్, అలిపిరి) ఈ అన్య మత చిహ్నాన్ని గుర్తించలేకపోయారు. ఈ సమాచారం అందిన వెంటనే, సంబంధిత విజిలెన్స్ సిబ్బంది వాహనాన్ని తిరుమల నందు ఫైర్ ఆఫీస్ సమీపంలోని పార్కింగ్ ప్రాంతంలో గుర్తించి, వెంటనే ఆ స్టిక్కర్‌ను తొలగించారు. అనంతరం, ఈ విషయంపై తిరుమల 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, వాహన డ్రైవర్ అయిన గోబి, కరూర్ జిల్లా (తమిళనాడు) మరియు ఆ వాహనం యొక్క యజమాని పై ఏపీ చారిటబుల్ మరియు హిందూ రిలీజియస్ ఇన్స్టిట్యూషన్ మరియు ఎండోమెంట్ యాక్ట్-1987 పరిధిలో కేసు నమోదు చేయబడింది. పలుమార్లు సూచనలు ఇచ్చినప్పటికీ స్టిక్కర్‌ను గుర్తించడంలో విఫలమైనందున, సిట-5949 వి.వాసు బాబును వెంటనే అలిపిరి విధుల్లో నుండి తొలగించడమైనది. అతని పై విధుల్లో నిర్లక్ష్యానికి సంబంధించి శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరిగింది.

శిల్పారామంలో అలరించిన భక్తి సంగీతం

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గురువారం తిరుచానూరు శిల్పారామంలో నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమం భక్తులను, ప్రేక్షకులను విశేషంగా అలరించింది. మహబూబ్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్‌రావు, బృందం అందించిన సాంప్రదాయ భక్తి గీతాలు, కీర్తనలు శ్రోతలను ఆధ్యాత్మికౌషాధిగా తీర్చిదిద్దాయి. సంగీత రాగాలుతో నిండిన ఈ కార్యక్రమం శిల్పారామాన్ని భక్తి వాతావరణంతో నింపింది. ఈ కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి (ఏవో) సుధాకర్, ఎలక్ట్రికల్ సూపర్వైజర్ వెంకటేశ్వర రెడ్డి, ఫీల్డ్ సూపర్వైజర్ పప్పి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-పాకాల: ఈనెల 14వ తేదీ నుండి ప్రారంభమై వారం రోజులపాటు కొనసాగిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిసాయి. గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ కస్తూరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో నీతి కథలతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన అనేక రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని కావున విద్యార్థులు అందరూ క్రమం తప్పకుండా గ్రంథాలయానికి వచ్చి వాటిని చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రవీంద్రబాబు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ కుమార్, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రెడ్డి రామరాజు, ఎన్‌విఎన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోహిణి, పాకాల గ్రామపంచాయతీ కార్యదర్శి లావణ్య లత, పాఠకులు విద్యాసాగర్, ఆనంద్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

పలమనేరు బాలోత్సవ కమిటీ ఎంపిక

విశాలాంధ్ర- పలమనేరు: పలమనేరు బాలోత్సవం నిర్వహిం చడానికి బాలోత్సవ కమిటీని గురువారం పలమనేరులోని ఒక ప్రైవేటు పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి. తులసినాథం నాయుడు, ప్రధాన కార్యదర్శిగా యుగంధర్ బాబు, ఉపాధ్యక్షులుగా జీవి రమణ, ధనంజయ, పుష్ప కార్యదర్శులుగా గంటా మోహన్, సిద్ధార్థ,జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, కోశాధికారులుగా గిరిధర మూర్తి, సుదర్శన చారి, కార్యవర్గ సభ్యులుగా నాగశివ ప్రసాద్, సురేష్,ఆనంద్ బెన్, డాక్టర్ దేవేంద్ర,డాక్టర్ రజిని,డాక్టర్ రాజశేఖర్, చంద్రశేఖరయ్య సలహాదారులుగా సీతారామయ్య, మాధవరెడ్డి, పలమనేరు బాలాజీ, నరసింహులు, ఆనందబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

డాక్యుమెంట్ పోయినది

తిరుపతి తేది 10.09.2025న కప్పల వీరస్వామి కమల్ అను నేను నాకు చెందిన రిజిస్టార్ పార్టీషియన్ డీడ్ డాక్యుమెంట్ నెం. 411/2003 డూప్లికేట్ పత్రాలు పోయినవి. నేను తిరుపతి నుండి సత్యవేడుకు పోవుటకు తిరుపతి బస్టాండ్‌లో బస్ ఎక్కు సమయంలో నా డాక్యుమెంట్ పోయినవి. ఈ డాక్యుమెంట్ ఎవరికైన దొరికితే ఈ సెల్ నెంబర్‌కు 6305827969. ఫోన్ చేయగలరని విజ్ఞప్తి చేస్తున్నాను.

పద్మావతి అమ్మవారి ప్రత్యేక పూజలో పాల్గొన్న రాష్ట్రపతి

నగర పాలక కార్యాలయం నుంచే
ప్లాస్టిక్ నిషేధం అమలు చేద్దాం
కమిషనర్ పి.నరసింహ ప్రసాద్

విశాలాంధ్ర-చిత్తూరు: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం పటిష్టంగా అమలు చేయాలని, నగర పాలక కార్యాలయం నుంచే ప్లాస్టిక్ నిషేధం అమలు చేద్దామని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ చెప్పారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో భాగంగా ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ 2016 ప్రకారం నగరంలో సింగల్ యూస్ ప్లాస్టిక్, నిషేధిత ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేయడంలో భాగంగా గురువారం నగర పాలక కార్యాలయంలో ఏఐఐఎల్ఎస్జీ సౌజన్యంతో నగరపాలక ఉద్యోగులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్ నిషేధం, అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. నగరపాలక కార్యాలయం నుంచే ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలని, ఉద్యోగులంతా ప్లాస్టిక్ వాడకాన్ని గణనీయంగా తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ పర్యవేక్షణ కోసం కలెక్టర్ జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీని నియమించినట్లు చెప్పారు. ఈ కమిటీ ప్రతినెల జిల్లాలో జరుగుతున్న ప్లాస్టిక్ నియంత్రణ అమలు కార్యక్రమాలను పర్యవేక్షిస్తుందన్నారు. నగరపాలక కార్యాలయంలో ప్లాస్టిక్ నిషేధం అమలులో భాగంగా ఉద్యోగులకు స్టీల్ బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డా. లోకేష్, ఏసీపీ నాగేంద్ర, డీఈ రమణ, టీపీవో శుభప్రభ, ఏఐఐఎల్ఎస్జీ రిసోర్స్ పర్సన్ శ్రీనివాస్, నగర పాలక సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లు పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గురువారం పట్టణం లోని అన్న క్యాంటీన్లను పరిశీలిం చారు. ఆహారం నాణ్యత గురించి ప్రజల ను అడిగి తెలుసుకున్నారు. తక్కువ ధరకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారని ప్రజలు అభిప్రాయపడ్డారు. పేదలకు తక్కువ ధరకు ఆహారాన్ని అందిం చాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్లను ప్రారంభించారని... ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. అంతేకాకుండా ఆహారంలో నాణ్యతలోపిస్తే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను ఆయన హెచ్చరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలతో మంచిగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముని రాజా నాయుడు, చెంచయ్య నాయుడు, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దారుగా నరేష్ కుమార్

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: మండల డిప్యూటీ తాసిల్దార్ నరేష్ కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. కుప్పం ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న నరేష్ కుమార్ ను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గంగాధర నెల్లూరు డిప్యూటీ తాసిల్దారుగా నియమించారు. ఇక్కడ డిప్యూటీ తాసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న మహేష్ను చిత్తూరు ఆర్డీవో కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ మేరకు గురువారం నరేష్ కుమార్ బాధ్యతలు తీసుకున్న సందర్భంగా మాట్లాడుతూ అధికారుల సూచనల మేరకు ప్రభుత్వం పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

సింగపూర్ విద్యా అధ్యయన యాత్రకు బాలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: సింగపూర్ విద్యా అధ్యయన యాత్రకు తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాళెం ప్రాథమిక పాఠశాలలో పని చేసే కయ్యూరు బాలసుబ్రహ్మణ్యంను రాష్ట్ర పరిశోధన శిక్షణా మండలి ఎంపిక చేసింది. ఈ నెల 27 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు వీరు సింగపూర్ లో విద్యాశాలలను సందర్శించి అక్కడి విద్యా సంస్కరణల స్థితిగతులపై అధ్యయనం చేసి రాష్ట్ర విద్యా శాఖ కు ఒక నివేదికను ఇవ్వనున్నారు. సింగపూర్ అధ్యయన యాత్రకు ఆహ్వానం రావడం పట్ల బాలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. పలువురు ఆయన్ను అభినందించారు.

స్కిల్ హబ్బులో శిక్షణకు ఆహ్వానం

విశాలాంధ్ర-కార్వేటినగరం: రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో కార్వేటినగరం ఐటిఐ కళాశాల ప్రాంగణంలో స్కిల్ హబ్ ఆధ్వర్యంలో పలు ట్రేడ్లకు ఆహ్వానం పలుకుతున్నట్లు ప్రిన్సిపాల్ ఆనంద తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డేటా ఇంజనీరింగ్ కు అర్హత ఇంటర్ డిగ్రీ కాల వ్యవధి మూడు నెలల నుంచి ఐదు నెలల ఉంటుందన్నారు. ఎలక్ట్రిక్ వెహికల్ సర్వీస్ టెక్నీషియనుకు ఎస్ఎస్సి ఐటిఐ ఇంటర్ డిగ్రీ వయసు 18-35 కాల వ్యవధితో మూడు నెలల నుంచి ఐదు నెలల పాటు ఉచిత ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని, యువత ఈ అవకాశాన్ని సద్విని చేసుకొని రిజిస్ట్రేషన్ కొరకు టీ.అబ్దుల్ 8142509017 నెంబరును సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా శిక్షణ తీసుకున్న అభ్యర్థులకు పిఎంకెవివై ద్వారా సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుంద న్నారు. కావున యువతీ యువకులు ఈ సదా అవకాశాన్ని వినియో గించుకోవాలని ఉపాధి పొందాలని ప్రిన్సిపాల్ కోరారు. ఆసక్తి గలవారు స్కిల్ హబ్ కేంద్రం నందు రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

డిసెంబరు 10న ఏడుగంగమ్మల జాతర

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీ శ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా శ్రీకాళహస్తిలో వెలసిన ఏడుగగంగమ్మల జాతర వచ్చే నెల 10వ తేదీన నిర్వహిం చనున్నారు. జాతరను పురస్కరించుకుని గంగమ్మ జాతర కమిటీలు విరాళాలను సేకరిస్తున్నాయి. ప్రతి యేటా జరిగే జాతర సందర్భంగా డిసెంబర్ 7వ తేదీ పట్టణంలో చాటింపు ఉంటుంది. 9వ తేదీ శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గంగమ్మలకు సారెను సమర్పిస్తారు. పదో తేదీ జాతర జరగనుంది. అదే రోజు రాత్రి నిమజ్జనం కార్యక్రమం కూడా నిర్వహిస్తారు. ఎక్కడా లేని విధంగా పట్టణంలో ఏడు ప్రాంతాల్లో గంగమ్మలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించడం శ్రీకాళహస్తిలో ప్రత్యేకత.

అట్టహాసంగా ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల వేడుకలు గ్రంథాలయ అధికారిని రెడ్డమ్మ ఆధ్వర్యంలో అట్టహాసంగా ముగిసాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిధులుగా చంద్రగిరి పంచాయతో ఇ.ఓ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిడిఓ వెంకటరత్నం హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వక్తలూ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు రావడం అలవాటు చేసు కోవాలని, గ్రంథాలయాలలో ఉన్న వివిధ పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంచుకోవాలని, ప్రతి ఒక్కరు గ్రంథాలయాలను సద్విని యోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికేట్లు, మెమొంటోలు, మెడల్స్, బుక్స్ బహుమతులను ప్రదానం చేసినారు. ఈ కార్యక్రమములో రాయల్ విక్టరి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమలత, శ్రీపద్మావతి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు సమలత, విశాలాక్షి, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రమేష్, పురప్రజలు, పాఠకులు, విద్యార్థులు, సిబ్బంది రమాదేవి పాల్గొన్నారు.

నేటి నుంచి పొరుగువారి హక్కులపై ఉద్యమం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పొరుగువారి హక్కులు అనే కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభమవుతుం దని జమాతే ఇస్లామీ హింద్ సంస్థ పట్టణాధ్య క్షుడు మహమ్మద్ అన్నారు. పట్టణంలోని సంస్థ కార్యాలయంలో గురువారం పొరుగువారి హక్కులు కార్యక్రమంపై పుస్తకాలు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది నిస్సారాలీ, షేక్ అమీర్‌బాషా, ముజమ్మిల్ అహ్మద్, అబ్దుల్‌నాసిర్, రఫీ, షబ్బీర్, దావూద్, లాల్‌బాషా, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మండల పార్టీ అధ్యక్షుడికి ఘన సన్మానం

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటి నగరం టిడిపి మండల పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం. చంగల్రాయ యాదవ్‌ను కృష్ణా పురం ప్రాజెక్ట్ చైర్మన్ ఆర్ అన్నామలై, టిడిపి జిల్లా యువ కార్యదర్శి బీగాల రమేష్, గణేష్ రాజు, సురేష్ రాజు, సూర్యనారాయణ రెడ్డి గురువారం శాలువాలు కప్పి సన్మానించారు.

వన సంరక్షణ సమితి కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని మూడు పంచా యతీ గ్రామాలకు వన సంరక్షణ సమితి కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగినది. కంభంపల్లి పంచాయతీ రేంజ్ కు చైర్మన్ గా విశ్వనాథ్ రెడ్డి వైస్ చైర్మన్‌గా శాంతమ్మ, మొట్లపల్లి రేంజ్‌కు చైర్మన్‌గా నాగార్జున వైస్ చైర్మన్గా శాంతమ్మ, వెంగమార్లపల్లి రేంజ్ కు చైర్మన్గా జీవి ప్రకాష్ వైస్ చైర్మన్గా వి మేనక లను ఎన్నుకోవడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల తెలుగుదేశం అధ్యక్షులు బి ఎం కిషోర్ గౌడ్ మాట్లాడుతూ అడవికి దగ్గరలో ఉన్నటువంటి ఈ మూడు పంచాయతీలలో వన సంరక్షణ సమితి కార్యవర్గాన్ని ఎన్నుకోవడం వలన వన సంరక్షణ ఒకటే కాకుండా అడవిలో చెట్లు నాటే కార్యక్రమాన్ని కూడా చేపట్టి జయప్రదం చేయాలని, వన సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మండల తెలుగు యువత అధ్యక్షులు భువన చంద్ర గౌడ్, నాయకులు మంజునాథ్ రెడ్డి, రెడ్డప్ప,కృష్ణమూర్తి, మోట్లపల్లి, రామాపురం, వెంగంవారిపల్లి మండల తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థినులు మహిళా హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-పాకాల: విద్యార్థినులు మహిళల హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ కిరణ్మయి తెలిపారు. గురువారం స్థానిక పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూని యర్ కళాశాలలోని విద్యార్థి నులకు బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మహిళా హక్కుల పట్ల అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ కిరణ్మయి మాట్లాడుతూ సమాజంలోని మహిళలకు తమ హక్కుల పట్ల అవగాహన లేకపోవడంతో అనేక సమస్యలు ఎదుర్కొంటు న్నారని కావున విద్యార్థినులు అందరూ మహిళా హక్కుల పట్ల అవగాహన కల్పించుకుని సమాజంలో మార్పు తీసుకువచ్చేందుకు ప్రయత్నించాలన్నారు. మహిళలకు విద్య యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రెడ్డి రామరాజు మాట్లాడుతూ ఆర్థిక అభివృద్ధిలో స్త్రీల పాత్ర గణనీయంగా పెరగాలని , స్త్రీ సాధికారికత ,బాల్య వివాహాలకు పై అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తులసి రామ్ రెడ్డి , దరణి కుమార్ ,విజయలక్ష్మి ,దేవి , సరళాదేవి, ఐసిడిఎస్ సభ్యులు శారద, సుజాత, వనిత మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల ముగింపు

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గ్రంథాలయ అధికారి ఏ.శ్రీముఖి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్రాంత గ్రంథ పాలకుడు ఎం.బాలాజీ డిజిటల్ గ్రంథాలయంపై వివరించగా, ఉపాధ్యాయులు చెంగయ్య, మాధురి పుస్తకాల పఠనం ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి మెడల్స్, సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు.

జాతరకు ఆహ్వానం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పట్టణంలో డిసెంబరు 10 న ఏడుగంగమ్మల జాతర జరగనుంది. దీనిని పురస్కరించుకుని జయరావువీధిలోని గంగమ్మ జాతర కమిటీ సభ్యులు గురువారం టీడీపీ సీనియర్‌నాయకులు లక్కమనేని మధుబాబును ఆహ్వానించారు. జాతరకు సంబంధించి కరపత్రా లను ఆయన ఆవిష్కరించారు. జాతరకు కావాల్సిన తన వంతు సాయం చేస్తామని హామీ ఇచ్చారు. జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అఖిలపక్ష సమావేశంలో అభివృద్ధిపై చర్చలు

విశాలాంధ్ర-గుడిపాల: గుడిపాల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశం విజయవంతంగా ముగిసింది. సమావేశంలో పంచాయతీల పరిశుభ్రత పై పురోగతి చర్యలు, చెత్త నిర్వహణ, డ్రెయినేజీ పనులు తదితర అంశాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. మండల ప్రత్యేక అధికారి ఎం. గుణశేఖర్ రెడ్డి, యం.పి.డి.ఓ ఓ. శిరీష, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామీణ రహదారుల మరమ్మతులు, తాగునీటి సరఫరా మెరుగుదల, పారుదల సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలు, వృక్షారోపణ, పర్యావరణ సంరక్షణ వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం ద్వారా అన్ని శాఖల మధ్య సమన్వయం బలోపేతం కాగా, గ్రామాల అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి అధికారులు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు.

ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలకు రావాలి

విశాలాంధ్ర-ఓజిలి: సకాలంలో ఉపాధ్యాయులు పాఠశాలకు రావాలని మండల విద్యాశాఖ అధికారిణి శైలజ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె గురువారం మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేయుచున్న ఉపాధ్యాయులు బడి గంట ముందే పాఠశాలలకు వచ్చి ఎవరైనా విద్యార్థులు పాఠశాలలకు గైరు హాజరు అవుతుంటే వారిని గుర్తించి వారి తల్లిదండ్రులకు తెలియపరచి, పిల్లలు సకాలంలో పాఠశాలలకు హాజరయ్యే విధంగా చూడాలని ఆమె తెలియజేశారు. అలాగే మధ్యాహ్నం భోజనం పథకం కూడా సక్రమంగా అమలు అయ్యే విధంగా చూడాలన్నారు.

తల్లిదండ్రులకు విద్యార్థులు అప్పగింత

విశాలాంధ్ర-గూడూరు: తప్పిపోయిన విద్యార్థులను తల్లి తండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ తిరుపతయ్య వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న శివసాయి, అక్షిత్ అనే ఇద్దరు విద్యార్థులు గురువారం తరగతి గది నుంచి వాష్రూంకు వెళ్లి వస్తామని ఉపాధ్యాయుడుకి చెప్పి పాఠశాల నుంచి ప్రహరీగోడ దూకి బయటకు వెళ్లారన్నారు. దీంతో విద్యార్థులు తిరిగి రాకపోవడంతో యాజమాన్యం పరిసర ప్రాంతాల్లో గాలించి వారు కనిపించకపోవడంతో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. వెంటనే స్పందించిన తమ సిబ్బంది బాలకృష్ణ, సురేష్, శ్రీనివాసులు, విష్ణు రైల్వేస్టేషన్లోని సీసీ కెమెరాలను పరిశీలించడం జరిగిందన్నారు. స్టేషన్లోని 4 నంబరు ప్లాట్ఫాంలో చెన్నై వైపు వెళుతున్న ఆగివున్న ఓ రైలు భోగిలో ఉన్న ఇద్దరు విద్యార్థులను గుర్తించి వారిని సురక్షితంగా తీసుకువచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిందన్నారు.

ఆర్చరీలో గోల్డ్ మెడల్

విశాలాంధ్ర-గూడూరు:

గూడూరు పట్టణంలో ఉన్న లయోలా జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి జి.వెంకట లోకేష్ విద్య తో పాటు ఆర్చర్ విభాగంలో రాణిస్తూ కోచ్ టి.శివశంకర్ శిక్షణలో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. విజయవాడలో జరిగిన సబ్ జూనియర్ ఇండియన్ రౌండ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు. అలాగే రాష్ట్ర స్థాయి స్కూల్ క్రీడా పోటీల్లో సిల్వర్ మెడల్,ఇండియన్ జూనియర్ మరియు సీనియర్ మీట్ లో స్వర్ణం సాధించారు. ఈ నవంబర్ 24 నుండి 30 వరకు అరుణాచల్ ప్రదేశ్‌లో జరగనున్న జాతీయ క్రీడల్లో పాల్గొనే అవకాశం లభించింది అని తెలిపారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాజనారయణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, కరస్పాండెంట్ పంట శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ క్రీడా పోటీల్లో పాల్గొని మరిన్ని పతకాలు సాధించాలని సూచించారు.

గుంతలను పూడ్చండి మహాప్రభో

విశాలాంధ్ర-చంద్రగిరి: అనునిత్యం వేలాదిమంది శ్రీవారి మెట్టు ద్వారా నడక మార్గాన తిరుమలకు వెళ్లే భక్తులు చంద్రగిరి-శ్రీనివాసమంగాపురం మధ్యలో గల రహదారి లో గల గుంతలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటు శ్రీవారి మెట్టు, పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీనివాస మంగాపురానికి రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి భక్తులు భక్తి భావంతో సుదీర ప్రాంతాల నుండి నడక మార్గాన శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీ కళ్యాణం వెంకన్నను దర్శించుకుని అనంతరం శ్రీవారి మెట్టుగుండా తిరుమలకు వెళుతుంటారు. రహదారి అక్కడక్కడ గుంతల మయం కావడంతో వారి బాధలు వర్ణనాతీతం. ప్రధానంగా శ్రీనివాసమంగాపురం ముఖద్వారం వద్ద గల తిరుపతి-పీలేరు జాతీయ రహదారి ఓవర్ బ్రిడ్జి సమీపంలో పెద్ద గుంత ఏర్పడి నెలలైనప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ముందస్తు జాగ్రత్తగా ఎలాంటి ప్రమాదం జరగకుండా చంద్రగిరి పోలీసులు హెచ్చరికతో కూడిన బోర్డును ఏర్పాటు చేయడం జరిగింది. అయినప్పటికీ తరచు ఈ గుంత కారణంగా ద్విచక్ర

వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. రహదారిలో గుంతలను పూడ్చండి మహాప్రభో అంటూ భక్తులు, స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు గుంతలను పూడ్చి నడక మార్గాన వెళ్లే భక్తులు, వాహనదారులకు సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

35 కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందజేత

విశాలాంధ్ర-వాకాడు:

బాలిరెడ్డి పాలెం శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామంలోని శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానంలో రామిరెడ్డి బలరామిరెడ్డి, రుక్మిణమ్మ, నాయుడు వెంకటరమణారెడ్డి, సరోజనమ్మల కుటుంబ సభ్యులు రామిరెడ్డి వేంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతుల ఆర్థిక సౌజన్యంతో ఆర్థికంగా వెనుకబడిన 35 కుటుంబాలకు ఒక లక్ష ఇరవై ఐదు వేల రూపాయల విలువ చేసే ఫలసరుకులు, కూరగాయలు, సంభావనలను ముఖ్య అతిథులు ఆలయ అర్చక స్వాములు శేషాచార్యులు,హరిబాబు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నారాయణం వేణుగోపాల్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ విదేశాలలో ఉన్నప్పటికీ స్వదేశంపై, సనాతన ధర్మంపై ఉండే మమకారం, నమ్మకంతో హైందవ ధర్మాన్ని పరిరక్షిస్తూ ఆర్థికంగా వెనుకబడిన 35 కుటుంబాలకు ఫలసరుకులు, కూరగాయలు, సంభావనలను అందజేయడం చాలా సంతోషమని, ఇటువంటి కార్యక్రమాలతో దాతలు జన్మను ధన్యం చేసుకుంటున్నారని అన్నారు. దాతలకు హృదయపూర్వక అభినందనలు, మంగళాశాసనములు అందించారు. సంస్థ ప్రతినిధి దీవి అనంతబాబు, ఆలయ అర్చక స్వామి తమిరిశ హరిబ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

విశాలాంధ్ర-వెంకటగిరి: 58వ

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వెంకటగిరి మహాత్మా గాంధీ శాఖ గ్రంథాలయంలో వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం మరియు క్రీడా పోటీలను నిర్వహించగా భారీగా స్పందన లభించింది. గురువారం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఎంఈఓ వెంకటేశ్వర్లు డాక్టర్ రామాంజనేయులు ప్రధానోపాధ్యాయులు రాధా ఉపాధ్యాయులు వల్లభశ్రైతస్కూల్ ఉపాధ్యాయులు వెంకటేష్ గఉపాధ్యాయులు గుర్రాల రమేష్ఎంపీస్ స్కూల్ రాణిపేట ఉపాధ్యాయులు విజయలక్ష్మి, దేవేందర్ జమీన్ రైతు విలేకరి చెంచు కృష్ణయ్య సీనియర్ పాఠకులు రిటైర్డ్ హిందీ ఉపాధ్యాయులు రాధాకృష్ణ సత్యనారాయణ, రాజమణిఅలాగే గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రధాన అతిథులు విద్యార్థులకు ఉపయుక్తమైన సలహాలు, మార్గదర్శకాలు, ప్రేరణాత్మక సందేశాలను అందించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ తరఫున అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. వారోత్సవాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ముఖ్య అతిథుల చేతులమీదుగా అందజేశారు. గ్రంథాలయ వారోత్సవాలు వారం రోజుల పాటు ఉత్సాహభరితంగా జరిగాయి. చివరి రోజు కావడంతో పాఠకులు, అతిథులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు

విశాలాంధ్ర-తొట్టంబేడు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గురువారం ఘనంగా 58వ జాతీయ గ్రంథాల వారోత్సవాల ముగింపు వేడుకలు జరిగాయి. అందులోభాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్‌పోటీలను నిర్వ్హిమంచారు. విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సురేంద్రనాథ్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జ్ఞాన సమూపార్జనకు గ్రంథాలయాలు నిలయాలు అన్నారు. ఒక మంచి పుస్తకం వందమంది మంచి స్నేహితులతో సమామని తెలిపారు. నేటి యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రంథాలయ అధికారి హరికృష్ణ మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకుని చిన్నతనంనుంచే గ్రంథాలయాలను సందర్శించే విధంగా ప్రోత్సహించి వారిబంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలనాన్రు. ఈ

కార్యక్రమంలో బాలికల వసతిగృహ అధికారి జయసుధ, రీడర్స్‌క్లబ్ సభ్యులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికే తొలి ప్రాధాన్యత: ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరి పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. గురువారం ఆఖస్మిక తనిఖీకి వెళ్లిన ఎమ్మెల్యే, అక్కడి సిబ్బంది హాజరు, రోగులకు అందిస్తున్న చికిత్స, మందుల లభ్యత, పరిశుభ్రత పరిస్థితులను సమగ్రంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఉన్న రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. మందుల సరఫరా ఎలా ఉందో, డాక్టర్లు సమయానికి అందుబాటులో ఉన్నారా? లేదా? అన్న వివరాలు కూడా తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యం అందించి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం ఖరీదైన మందులను రోగులకు అందుబాటులోకి తీసుకువచ్చిందని చెప్పారు. గుండెకు సంబంధించి రూ. 50 వేలు విలువ చేసే మందులు ఆసుపత్రిలో అందుబాటులో ఉంచామన్నారు. వీటిని సకాలంలో రోగులకు వినియోగించి ప్రాణాలు కాపాడాలని కోరారు. "ప్రజారోగ్యమే మా మొదటి ప్రాధాన్యత. నాణ్యమైన వైద్యం ప్రతి ఒక్కరికీ ఉచితంగా అందాలి. హాస్పిటల్

పరిశుభ్రత విషయంలో ఎక్కడా రాజీ ఉండకూడదు. డాక్టర్లు, సిబ్బంది సమయపాలన తప్పనిసరి" అని స్పష్టం చేశారు. ఆస్పత్రి లోపాలను వెంటనే సరిచేయాలని, ప్రజలకు ఇబ్బందులు రాకుండా వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని అధికారులు, వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. వైద్య సేవల నాణ్యత పెంపుపై పలు సూచనలు కూడా చేశారు.ఈ కార్యక్రమంలో చైర్మన్, నియోజకవర్గ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి ప్రత్యేకపూజలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ :తిరుపతి రూరల్ మండలం కాపు చంద్రపేట గ్రామంలో గురువారం అయ్యప్ప మహా పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు కలిసికట్టుగా రామాలయం వద్ద అయ్యప్పకు పడిపూజ చేశారు. ఆలయం వద్ద పెద్ద ఎత్తున అయ్యప్ప మాల దారుణ చేసిన భక్తులు భజనలు చేసి స్వామిని కీర్తించారు. అనంతరం ఆలయం వద్ద సామూహికంగా భక్తులు అందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రామచంద్రాపురం మండలం సి.రామాపురంకు చెందిన ఉదయ్ గురుస్వామి ఆధ్వర్యంలో మహా పడి పూజ మహోత్సవం కన్నుల పండువుగా సాగింది. స్వామియే.. శరణం అయ్యప్ప.. శరణంశరణం అయ్యప్ప.. స్వామి శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణలతో కేసీపేట గ్రామం మార్మోగింది. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, పిల్లలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

వైసిపి కోటి సంతకాలు సేకరణ

విశాలాంధ్ర -పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా సత్యవేడు నియోజకవర్గం వైయస్సార్సీపి సమన్వయకర్త నూక తోటి రాజేష్ ఆదేశాల మేరకు పిచ్చాటూరు మండలం వైసిపి అధ్యక్షుడు చలపతి రాజు ఆధ్వర్యంలో గురువారం నీరువాయి గ్రామం లో సచివాలయం కన్వీనర్ గోవిందస్వామి, మోహన్, తోపయ్య, గ్రామ సర్పంచి వెంకటేశులు పాల్గొని కోటి సంతకాల సేకరణ చేపట్టారు. చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించి, వైద్య కళాశాల ప్రైవేటీకరణ జరిగితే పేదలకు వైద్యం అందదని,విద్యార్థులకు వైద్య వృత్తి దూరమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కరుణామూర్తి, పయని,కార్యకర్తలు వరదచన్, హిమై పాల్గొన్నారు.

భువనమ్మ మండల పర్యటనను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - రామకుప్పం : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి సతీమణి ఎన్టీఆర్ ట్రస్టీ చైర్పర్సన్ నారా భువనమ్మ నేటి శుక్రవారం మండలానికి విచ్చేయనున్నారని ఆమె పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ మరియు మాజీ మండల అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి, ఆనంద రెడ్డి, లు పేర్కొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం సుమారు రెండు గంటలకు మండల పరిధిలోని విజలాపురం పంచాయతీ పెద్ద చెరువు వద్ద జలహారతి అనంతరం అనిగానూరు లోని వాసవి కళ్యాణమండపం లో మహిళలతో ముఖాముఖి సమావేశం లో పాల్గొంటారని అదే విధంగా బళ్ళ గ్రామంలో మహిళల సమావేశం లో మాట్లాడనున్నారని పై కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ భార్గవి చిన్నికృష్ణ, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు చలపతి, సింగిల్ విండో మాజీ చైర్మన్ సీతాపతి , రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, సింగిల్ విండో చైర్మన్ మహ్మద్ రఫీ, రామ్మూర్తి, ఐటీడీపీ మండల అధ్యక్షుడు సురేష్, ఆదిల్ బాషా, చాంద్ బాషా, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు

తమ నాయకుడు కష్టాల్లో ఉన్న వేళ పుట్టినరోజు జరుపుకోవడం సరికాదు

తుంటి సుధా యాదవ్

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ :తిరుపతి రూరల్ మండలం మంగళంకు చెందిన వైసీపీ ప్రచార విభాగం అధ్యక్షులు సుధా యాదవ్ పుట్టినరోజు సందర్భంగా ఏ విధమైన వేడుకలు నిర్వహించబడడం లేదు. ఈ విషయాన్ని అయన స్వయంగా తన అనుచరులు, అభిమానులకు తెలియజేశారు. తిరుపతి రూరల్ మండలం మంగళంకు చెందిన వైసీపీ ప్రచార విభాగం అధ్యక్షులు సుధా యాదవ్ ఈ ఏడాది తన పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉంటున్నారు.తనకు ఎంతో ఆప్తుడిగా, ఆదర్శ నాయకుడిగా భావించే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రస్తుతం అక్రమ మద్యం కేసులో అరెస్ట్ అయి జైలు శిక్ష అనుభవిస్తున్నందున, ఈ పరిస్థితుల్లో పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం తగదు అని భావించినట్లు సుధా యాదవ్ తెలిపారు.తన నాయకుడు కష్టాల్లో ఉన్న వేళ తన పుట్టినరోజు జరుపుకోవడం సరికాదని భావించి, ఈ ఏడాది అన్ని కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు అయన ప్రకటించారు. ఈ నిర్ణయానికి తన అనుచరులు, అభిమానులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వికలాంగుల శిబిరాన్ని పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన వికలాంగుల శిబిరాని జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్వయంగా వికలాంగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని వారికి కావలసిన డిపార్ట్మెంట్లకు పంపించారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఈ వికలాంగుల వైద్య శిబిరాన్ని విశేష స్పందన లభించిందని జిల్లా వికలాంగుల అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వైద్యధికారులతో లబ్ధిదారుల గురించి అడిగి తెలుసుకున్నారు. వికలాంగులకు చేపట్టిన సౌకర్యాలను చూసి ఎంపీడీవోను, తహసీల్దార్ ని కలెక్టర్ అభినందించారు. వికలాంగులకు పరికరాలు గుర్తించడం జరిగిందని, ఎక్కువగా కంటికి, చేతులు, చెవిటి కాళ్లు సంబంధించిన వారు పాల్గొనడం. జరిగింది. లబ్ధిదారులందరి ఆయా సచివాలయ ద్వారా నమోదు చేయడం జరిగిందన్నారు. సంబంధిత పరికరాలు ప్రభుత్వం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ వికలాంగుల కార్యక్రమం కార్వేటినగరం, శ్రీ రంగరాజపురం, వెదురుకుప్పం, పాలసముద్రం, గంగాధర్ నెల్లూరు మండలాలకు సంబంధించిన వికలాంగుల పాల్గొనడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి శ్రీదేవి నగరి ఆర్డిఓ అనుపమ ఎంపీడీవో చంద్రమౌళి తహసీల్దార్ నాగరాజు రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్పో పొన్న యుగంధర్, స్థానిక సర్పంచ్ ధనంజయ వర్మ మండల పార్టీ అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజా (ఎమ్మెల్యే సోదరులు), టిడిపి నాయకులు రవి యాదవ్, డిప్యూటీ ఎంపీడీవో మధుసూదన్ ఏఎస్‌డబ్బ్యూ శ్రీనివాసులు, ఆర్ఐ ఎంఈఓ విజయ్ కుమార్, వేయి నాగభూషణం నరసింహులు, ఏపీవో కవిత, వైద్యాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఐటియుసి ఆధ్వర్యంలో పూల వ్యాపారస్తుల

నూతన కార్యవర్గం

విశాలాంధ్ర-వెంకటగిరి: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వెంకటగిరిలో అంకమ్మ గుడి దగ్గర పూల వ్యాపారస్తులు సమావేశం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వెంకటగిరి నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి పల్లిపాటి బాలకృష్ణ పూల వ్యాపారస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యాపారస్తులంతా కలసికట్టుగా ఉండాలని ఏమి సాధించాలన్న యూనిట్గా ఉండాలని వారిని కోరారు పూల వ్యాపారస్తుల సమస్య మీద ఏఐటీయూసీ మీకు అండగా ఉంటుందని అన్నారు మీకు ఏ సమస్యలు వచ్చినా ఏఐటీయూసీ నాయకత్వం ముందుండి మీ సమస్యలకు పరిష్కారం చేస్తాదని తెలిపారు ఈ సమావేశంలో 9 మందితో నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది గుడికుంట్ల చెంచు కృష్ణయ్య అధ్యక్షుడు పూజారి వెంకట రమణయ్య ఉపాధ్యక్షుడు మూలం మునీంద్రయ్య కార్యదర్శి పూజారి కన్నయ్య సహాయ కార్యదర్శి ఏ రామయ్య ట్రెజరర్ కమిటీ సభ్యులు సి వెంకీ బి దయాకర్ జి శివ పి కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో వీధి వ్యాపారస్తుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం మునీంద్ర సిపిఐ వెంకటగిరి నియోజకవర్గ సమితి సభ్యులు పైడి గంటల మునికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వామి వారి నిత్య అన్నదానానికి విరాళం

విశాలాంధ్ర -పూతలపట్టు: పూతలపట్టు నియోజవర్గం ఐరాల మండలం శ్రీ స్వామివారి దేవస్థానం నిత్య అన్నదానం ట్రస్ట్ కి విరాళంగా - 1,00,216/- రూపాయలను దాత పెద్ది శ్రీధర్, వారి కుటుంబ సభ్యులు గుంటూరు చెందిన వారు సమర్పించారు. వీరికి సూపరిడెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడులు దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

కృష్ణా జలాలకు హారతులిచ్చిన నారా భువనేశ్వరి

విశాలాంధ్ర - కుప్పం: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం నాలుగు రోజుల పర్యటనలో భాగంగా రెండవ రోజు గురువారం కుప్పం మునిసిపాలిటీ పరిధిలోని డీకే పల్లి వద్ద చెరువుకి హంద్రీనీవా ద్వారా వచ్చిన కృష్ణమ్మ జలాలకు ఆమె చేతుల మీదుగా జల హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇంత అద్భుతమైన కార్యక్రమంలో కృష్ణమ్మ జల హారతిలో పాల్గొనడం నా అదృష్టం అని కుప్పం ప్రజలపై ఉన్న ప్రేమను నారా చంద్రబాబు హంద్రీనీవా ద్వారా కృష్ణమ్మ జలాలను కుప్పం తీసుకొచ్చి నిరూపించారుఅని, కుప్పం ప్రజలకు త్రాగు సాగునీరు, సాగునీరు అందించడం ధ్యేయంగా కృష్ణమ్మ జలాలను తీసుకు రావడం తో ప్రతి చెరువు ఒక్కొక్కటిగా నిండుతోందని పాడి పంటలు ఇంక కుప్పం నియోజకవర్గం లో సమృద్ధిగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమం లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడ పిడి వికాస్ మర్మత్, పికెఎం ఉడా చైర్మన్ డా.సుధీర్, మాజీ ఎ ఎం సి చైర్మన్ సత్యేంద్ర శేఖర్, తెదేపా శ్రేణులు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన నారాభువనేశ్వరి

విశాలాంధ్ర - కుప్పం: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి నారా భువనేశ్వరి కుప్పం నాలుగు రోజుల పర్యటనలో భాగంగా రెండవ రోజు గురువారం కుప్పం మునిసిపాలిటీ పరిధిలోని పరమసముద్రం సమీపంలో గల కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల సమావేశంలో పాల్గొని, అనంతరం వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఇంత అద్భుతమైన కార్యక్రమంలో పాల్గొనడం విద్యార్థులను కలవడం నా అదృష్టంగా భావిస్తున్నాన్నారు. చంద్రబాబు హయాం లో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా, నాణ్యమైన విద్యను అందిస్తున్నారు అని అన్నారు. విద్యపై దృష్టి సారించాలని, ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో కడ పిడి వికాస్ మర్మత్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పికెఎం ఉడా చైర్మన్ డా.సుధీర్, అధ్యాపకులు, విద్యార్థినీవిద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

చెట్లు నాటుదాం.. భూమిని కాపాడుదాం

విశాలాంధ్ర-తిరుపతి: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల తిరుపతి. ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు గురువారం అడపా రెడ్డి పల్లె గ్రామంలో అంగన్వాడీ కేంద్రం మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో చెట్లు నాటారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్.ఎస్.ఎస్ అధికారి డాక్టర్ ఎన్. సబితా మాట్లాడుతూ "పర్యావరణ రక్షణకు చెట్లే శక్తి" అని పిలుపునిచ్చారు. అదేవిధంగా భూమిపై వేగంగా విస్తరిస్తున్న విషసస్యమైన వయ్యారిభామ కలుపు మొక్క నిర్మూలన పై పాఠశాల విద్యార్థులకు ఏ.డి. రిప్రజెంటేటివ్ డాక్టర్ సి. నాగమణి అవగాహన కల్పించారు.

జాతీయ సేవా పథకంలో భాగంగా పచ్చదనం పరిశుభ్రత

విశాలాంధ్ర-తిరుపతి: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు అడపా రెడ్డిపల్లి గ్రామం జాతీయ సేవా పథకంలో భాగంగా పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం మరియు ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలో ప్రధాన వీధులను, రహదారులను శుభ్రపరిచారు. ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎన్.సబితా గ్రామ ప్రజల భాగస్వామ్యాన్ని అభినందిస్తూ పర్యావరణాన్ని రక్షించడం మరియు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఎడి రిప్రజెంటేటివ్ డాక్టర్ సి.నాగమణి పర్యావరణ పరిరక్షణ లో అందరూ భాగ్యస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్యమే మహాభాగ్యం : ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

విశాలాంధ్ర-తిరుపతి: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల తిరుపతి ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు అడపా రెడ్డి పల్లి గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ పి.కృష్ణ నైమీషా, సి.హెచ్.ఓ రేఖ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొని గ్రామస్తులకు రక్తపోటు, షుగర్, రక్తహీనత, మొదలైన ఆరోగ్య పరీక్షలు మరియు దంత పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్.ఎస్.ఎస్ అధికారి డాక్టర్ ఎన్.సబితా మాట్లాడుతూ, ఇటువంటి శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని గ్రామ ఆరోగ్యమే దేశాభివృద్ధి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్ డాక్టర్ సి. నాగమణి మరియు గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కలెక్టరుకు కృతజ్ఞతలు తెలిపిన టిడిపి నాయకులు

విశాలాంధ్ర-కార్వేటి నగరం: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సోదరులు వీ రాజా కార్వేటి నగరంలో గురువారం వికలాంగుల వైద్య శిబిరం ఏర్పాటుచేసిన వారికి పరికరాలను అందించడం పట్ల కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లోపార్టీ అధ్యక్షులు చంగల్ రాయ్ యాదవ్, జీడి నెల్లూరు బీసీ సంఘం అధ్యక్షులు రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరుకు స్వాగతం పలికిన అధికారులు

విశాలాంధ్ర-కార్వేటినగరం: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్కు కార్వేటినగరంలోని డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి ఎంపీడీవో చంద్రమౌళి నగరి ఆర్డిఓ అనుపమ మండల తహసీల్దార్ నాగరాజు పారే తంగరం సర్పంచ్ ధనంజయ వర్మాలు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు.

నవజాత శిశువుకు పౌష్టికాహారం అందేలా చూడాలి

హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్

విశాలాంధ్ర - చంద్రగిరి: నవజాత శిశువుకు పౌష్టికాహారం అందేలా చూడాలని చంద్రగిరి రూరల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు.చంద్రగిరి రూరల్ హెల్త్ శిక్షణ కేంద్రం లో గురువారం నవజాత శిశు వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ మధుసూదన రావు, డాక్టర్ యుగంధర్, డాక్టర్ సౌమ్య ప్రియ, డెంటల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రేవతి మాట్లాడుతూ జాతీయ నవజాత శిశువుల సంరక్షణ వారోత్సవాలను, ప్రతి సంవత్సరం నవంబర్ 15 నుండి 21 వరకు జరుపుకుంటున్నామని, నవజాత శిశువుల ఆరోగ్యం, సంరక్షణ ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడం, అలాగే, శిశు మరణాలను తగ్గించడం దీని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రపంచంలో తొలిసారిగా నవజాత శిశువుల మరణాలను అరికట్టి సాధ్యమైనంతగా తగ్గించడానికి భారతదేశం 2014లో నవజాత శిశువుల కార్యాచరణ పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు.జన్మించిన ప్రతి శిశువు జీవించి పెరిగి సమాజానికి ఉపయోగపడి దేశాభివృద్ధిలో పాల్గొనేలా చేసే లక్ష్యంతో, నవజాత శిశువులకు పౌష్టిక ఆహారం అందేలా చూడడానికి, ప్రభుత్వం పోషన్ అభియాన్ పథకం కింద అన్ని చర్యలను తీసుకుంటున్నదని, ఈ సందర్భంగా నవజాత వారోత్సవాలపై మరింత అవగాహన కల్పించి, ఆలోచనా సరళిలో మార్పు తీసుకుని రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌస్ సర్జన్లు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ టాటాబాయి, హెల్త్ సూపరవైజర్లు ప్రమీల, నారాయణరాజు, హెల్త్ అసిస్టెంట్లు సుబ్బలక్ష్మి, గిరిజ, శశిరేఖ, గర్భవతులు, తల్లులు పాల్గొన్నారు.

నూతన భోజన శాలను ప్రారంభించిన, పూతల పట్టు శాసనసభ్యులు కలికిరి మురళీ మోహన్

విశాలాంధ్ర-పూతలపట్టు: పూతలపట్టు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన భోజనశాల ప్రారంభోత్సవం లో పాల్గొన్న పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీ మోహన్ పులిగుండ్ల రామస్వామి నాయుడు, పులిగుండ్ల జయ లక్ష్మమ్మ, తల్లిదండ్రులు వారి జ్ఞాపకార్థం గా పూతలపట్టు జడ్పీ హైస్కూల్‌లో భోజనశాలకు సహాయం అందించిన వారి కుమార్తె పూతలపట్టు మండలం ఆకనబట్టు గ్రామానికి చెందిన ఎన్నారై అనూష వారి కుటుంబసభ్యులుపూతలపట్టు హైస్కూల్నకు బోజన శాల నిర్మించారు. వారిని అభినందించిన పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళి మోహన్ సమాజ సేవను ప్రతి ఒక్కరూ చెయ్యాలి అని పిలుపు నిచ్చిన ఎమ్మెల్యే కలికిరిమురళి మోహన్, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారి కుటుంబ సభ్యులు చంద్రశేఖర్ నాయుడు శేషాద్రి నాయుడు, కోటీశ్వరమ్మ, పూతలపట్టు మండల పార్టీ అధ్యక్షులు దొరబాబు చౌదరి, బంగారుపాళ్యం మండల పార్టీ అధ్యక్షులు ఎన్పీ ధరణి ప్రసాద్, సీనియర్ నాయకులు చంద్రమౌళి, గుంటూరు మురళి ఎస్సీ సెల్ ప్రెసిడెంటు గొడుగు చింత దాము పూతలపట్టు సర్పంచ్ మాశిలమని,పాఠ శాల ప్రధానోపాధ్యాయుడు మదుసూధన రెడ్డి మాజీ ఎంఈఓ కేపి సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయులు కృష్ణమూర్తి ,నాధముని, రవి,కూటమి నాయకులు, కార్యకర్తలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కురుగొండ్ల చేతుల మీదుగా జాబ్ మేళా పోస్టర్స్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంక టగిరి నియోజకవర్గ యువత కు ఉద్యోగా వకాశాల పండుగ రాబోతోంది. రాష్ట్ర నైపుణ్యాభి వృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ 25 (మంగళవారం) ఉదయం 8 గంటలకు వెంకటగిరి విశ్వోదయ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్లో నిర్వహించబోయే మెగా జాబ్ మేళా కోసం పోస్టర్లను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆవిష్కరించారు. "యువత ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలి" ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గం యువతి యువకుల భవిష్యత్తు కోసం ఈ జాబ్ మేళా గొప్ప అవకాశంగా నిలవాలి. చదువుకుని ఖాళీగా ఉన్న ప్రతి నిరుద్యోగ యువకుడు తప్పకుండా హాజరయ్యాలి" అని తెలిపారు.14 ప్రముఖ కంపెనీలు 720కి పైగా ఉద్యోగాలు శ్రీ సిటీ, మేనకూరు క్లస్టర్, తిరుపతి, చెన్నై ప్రాంతాల్లోని 14 బహుళజాతి కంపెనీలు 720o ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 5వ తరగతి నుంచి పీజీ వరకు అర్హత జాబ్ మేళాకు హాజరయ్యేందుకు అర్హతలు: 5వ తరగతి పైన చదివిన వారు10వ తరగతి / ఇంటర్‌డిప్లొమా / డిగ్రీ / పీజీ ఉత్తీర్ణులు యువతి-యువకులందరూ పాల్గొనవచ్చని నైపుణ్యాభివృద్ధి అధికారి తెలిపారు. రిజిస్ట్రేషన్ తప్పనిసరి ఇంటర్వ్యూలకు హాజరు కావాలంటే కింది లింక్ లో ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేయాలి: రిజిస్ట్రేషన్ లింక్: చివరి తేదీ: నవంబర్ 24, 2025 స్పాట్ రిజిస్ట్రేషన్లకు కూడా అవకాశం ఉంది అత్యవసర గమనిక హాజరయ్యే అభ్యర్థులు: 1.రిజిస్ట్రేషన్ లింక్‌లో ఆధార్‌తో పూర్తి చేయాలి 2.మీ ప్రొఫైల్ లాగిన్ అయి అన్ని కంపె నీలకు అప్లై చేయాలి 3.అడ్మిట్ కార్డ్ ప్రింట్ తీసుకుని ఇంటర్వ్యూకు హాజరుకావాల్సి వుంటుంది.

శుక బ్రహ్మాశ్రమంలో కార్తీక వనభోజనం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి క్షేత్ర పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం శుక బ్రహ్మాశ్రమం ధాత్రి వనంలో కార్తీక మాస అమావాస్య వనభోజన కార్యక్రమం జరిగింది. ఉసిరి వృక్షం కింద శివుని పూజించి భక్తి ప్రపత్తులతో క్షేత్ర పరిరక్షణ సమితి సభ్యులు, మహిళలు భారీ ఎత్తున నేతి దీపాలను వెలిగించారు. ఉసిరి వృక్షానికి ప్రదక్షిణలు చేశారు. తదుపరి శ్రీకాళహస్తి క్షేత్ర పరిరక్షణ సమితి అధ్యక్షులు పురుషోత్తం గౌడ్, బుద్ధ వెంకయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అతిథులుగా భక్తవత్సలయ్య, ఆయన సతీమణికాగల శైలజ హాజరయ్యారు. విశిష్ట అతిథిగా ఈశ్వర్ విచ్చేశారు. గౌరవ అధ్యక్షులు సింగరాజు ప్రకాశం శాస్త్రి తన సందేశం, వార్షిక నివేదిక చదివి వినిపించారు. ఇక వెంకయ్య మాటాడుతూ... శ్రీకాళహస్తి క్షేత్రంలో దేవాంగుల మండపం, గుర్రాల మండపం పునర్నిర్మాణం కోసం చేసిన ఉద్యమాలు ప్రస్తావించారు. స్వర్ణముఖి నది ప్రక్షాళనకు సహకరించిన విధానం తెలియజేశారు, సనాతన ధర్మం సంప్రదాయాలు భాగంగా గిరిప్రదక్షిణ విశిష్టత గురించి కనుమ పండుగ, శివరాత్రి రోజు రెండుసార్లు జరిగే స్వామి అమ్మవార్ల ద్వీప్రదక్షిణ మహొూత్సవం గురించి విశిష్టత గురించి వివరించారు. పీఎం చంద్ర ...శ్రీకాళహస్తి క్షేత్రం 14 పేర్లు ప్రాధాన్యతను తెలియజేశారు. సద్యో ముక్తి క్షేత్రం సత్య వ్రత క్షేత్రం, భాస్కర క్షేత్రం వంటి పేర్లతో కాళహస్తి పిలవబడుతుందని... సువర్ణ ముఖినదికి ప్రతి సంవత్సరం పుష్కరాలు వస్తాయని... సత్యో ముక్తి తీర్థమని సకల పాపాలు తొలగిపోతాయని ఆయన తెలియజేశారు. ఇక విశ్రాంత ఉపాధ్యాయలు ముని సుబ్బారెడ్డి ..వన పరిరక్షణ, వన విశిష్టతను గురించి ఒక కవిత, తెలుగులో పద్యాలను వినిపించారు,. పెద్ద కాళహస్తి మహత్యం ధూర్జటి మనుమడు లింగరాజ కవి రచించిన గ్రంధాన్ని సమితి సభ్యులు, భక్తులకు అందజేశారు. అందులో ఉన్న విశేషాలను క్షేత్ర పవిత్రత మహత్యాన్ని వివరించారు.. ఈ కార్యక్రమంలో ఆర్య సమాజ సభ్యులు శంకర్, రమేష్, చంగల్ రెడ్డి, డాక్టర్ నగరి చాముండేశ్వరరావు పాల్గొన్నారు.

గృహ నిర్మాణానికి 2.5 లక్షలు

జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్

విశాలాంధ్ర-తిరుపతి : కూటమి ప్రభుత్వం ఇల్లు నిర్మాణానికి అందిస్తున్న రెండున్నర లక్షల రూపాయలను లబ్ధిదారులు ఉపయోగించుకోవాలని జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ అన్నారు. మండలం నెల్లెపల్లి పంచాయితీలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణానికి అందిస్తున్న రెండున్నర లక్ష రూపాయలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇల్లు కట్టుకోవాలి స్థలం లేని వారు తమ దృష్టికి తీసుకొస్తే ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని అన్నారు. లబ్ధిదారులు సచివాలయాన్ని సంప్రదించి జియో ట్యాగ్గింగ్ చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ యువరాజ్, డిజిటల్ అసిస్టెంట్ కిషోర్ పంచాయతీ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

టిడిపిలో రెండు వర్గాల మధ్య ఘర్షణ

విశాలాంధ్ర-పుంగనూరు: టిడిపి రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు పట్టణ పరిధిలో వార్డ్ కమిటీలు వేయడం కొరకు పట్టణ పరిశీలకులు మహేష్ యాదవ్ పుంగనూరుకు రావడం జరిగింది. ఆయన బుధవారం 8 వార్డులకు కమిటీలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా గురువారం రోజున పట్టణ పరిధిలో కమిటీలు వేస్తుండగా నక్కబండ ప్రాంతంలో వార్డ్ కమిటీ అధ్యక్షుని నియమిస్తుండగా మధుసూదన్ నాయుడు వర్గానికి చెందిన మధుసూదన్ రాయల్ తమ వర్గానికి చెందిన వ్యక్తిని నియమించాలని కోరడం జరిగింది. అందులో నియోజవర్గ టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి వర్గానికి చెందిన రామకృష్ణంరాజు పార్టీకి ఎలక్షన్లో పనిచేయని వారిని నియమించే ప్రసక్తి లేదని వాదించడం జరిగింది దీనితో రామకృష్ణంరాజుకు మధుసూదన్ రాయలకు ఇరు వర్గాల మధ్య మాటలు యుద్ధాం చోటుచేసుకుంది అందులో కలుగజేసుకున్న చల్లా బాబు వర్గానికి చెందిన దినేష్ కుమార్ ఎన్నికల అప్పుడు పనిచేయని వారంతా ఇప్పుడు వచ్చి మాట్లాడితే కుదరదని హెచ్చరించారు దీనితో కొంగుతున్న మధుసూదన్ రాయల్ దినేష్ పైకి దూసుకుని పోవడం జరిగింది దీనితో ఇరువర్గాల మధ్య ఘర్షణ ఏర్పడింది పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చదరగొట్టడం జరిగింది అలా

ప్రారంభమైన గొడవ పట్టణంలోని కుమ్మర వీధి సమీపంలో మరల ఇరువు వర్గాల మధ్య ఘర్షణ ఏర్పడి ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడం జరిగింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి దాడి చేసుకున్న దినేష్ కుమార్ మధుసూదన్ రాయల్‌ను పోలీస్ స్టేషన్కు తరలించడం జరిగింది దీనిపై ఇరువర్గాలు పలమనేర్ డి.ఎస్.పి ప్రభాకర్ రెడ్డికి ఫిర్యాదులు చేయడం జరిగింది. ఫిర్యాదులు స్వీకరించిన డి.ఎస్.పి విచారణ చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఇరు వర్గాలకు తెలియజేశారు. ఒకే పార్టీలో దాడులు చేసుకోవడంతో వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పార్టీ అధిష్టానానికి సిఫారసు చేయడం జరుగుతుందని పార్టీ పరిశీలకులు మహేష్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి. చిత్తూరు ఎమ్మెల్యే

విశాలాంధ్ర -చిత్తూరు : విద్యార్థులు పుస్తక పఠనం అలవరచు కావాలని చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురువారం విజయం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకోవాలని, తద్వారా తమ భవిష్యత్తుకు ఉన్నతిని ఏర్పరచుకోగలరని పేర్కొన్నారు. విద్యార్థులు యువత గ్రంథాలయాల సద్వినియం చేసుకోవాలన్నారు. సమయాన్ని వృధా చేయకుండా గ్రంథాలయంలో పుస్తక పఠనంపై ఆసక్తి చూపాలని తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ, గ్రంథాల అధికారి గజేంద్ర, ఎస్ఐ నాగ సౌజన్య , టిడిపి నేత కాజుర్ బాలాజీ, చిత్తూర్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు విజయం విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేన ప్రధాన కార్యదర్శిని కలిసిన తోట కృష్ణయ్య

విశాలాంధ్ర-వెంకటగిరి : మంగళగిరిలోని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన శ్రీ రామ్ తపూర్వకంగా కలిసి, ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశాను. అలాగే వెంకటగిరి నియోజకవర్గానికి సంబంధించిన జనసేన పార్టీ విషయాలను సమగ్రంగా వివరించాను. దీనికి స్పందించిన ఆయన, త్వరలోనే నెల్లూరుకు వస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు మరోసారి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను.

చెంచయ్యనాయుడుకు నింద్ర సుధాకర్ శుభాకాంక్షలు (ఫోటో 23)

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా రంగినేని చెంచయ్యనాయుడు రెండవ సారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు నింద్ర సుధాకర్ గురువారం ఆయనను కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగాసుధాకర్ మాట్లాడుతూ చెంచయ్యనాయుడు మరన్ని ఉన్నతమైన పదవులు అ్యధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రజా నాయకుడు చెంచయ్యనాయుడుకు మరోసారి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కడం సంతోషమకరమన్నారు.

బ్రహ్మోత్సవాల భక్తులకు పాలు బ్రెడ్ పంపిణీ

అభయ హస్త గోవింద సేవా మండలి - చంద్రమౌళి జగన్నాథం

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీ పద్మావతి అలివేలు మంగమ్మ కార్తీక బ్రహ్మోత్సవాలలో భక్తులకు పాలు బ్రెడ్ లను అభయ హస్త గోవింద సేవా మండలి శ్వేతా చంద్రమౌళి జగన్నాథంల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ తిరుచానూరు (అలివేలు మంగ పట్టణం) లో జరిగే పద్మావతి అమ్మ వారి కార్తీక బ్రహ్మోత్సవాలలో ప్రతిరోజు భక్తులకు పాలు బ్రెడ్డు లను అందజే ఇస్తున్నామని సమస్త సభ్యులు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా చేస్తున్నామని అమ్మవారి సన్నిధిలో భక్తులకు ఇలాంటి సేవలు అందించేందుకు అందరికీ ఆసక్తిని అమ్మవారు అందించాలని కోరుకుంటూ అందరూ బాగుండాలి అందులో నేనుండాలి , అన్నారు. ఈ కార్యక్రమంలో అభయ హస్త గోవింద సేవ మండలి సభ్యులు మరియు జగన్నాథం కుటుంబ సభ్యులు మున్సిపల్ పార్కు పతాంజలి యోగ బృందం పాల్గొని ఈ పంపిణీ కార్యక్రమాన్ని శ్రీ పద్మావతి అమ్మవారి ఆశీస్సులతో విజయవంతంగా చేస్తున్నామని తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-దొరవారి సత్రం: మండల పరిధిలోని ఏకొల్లు గ్రామ సమీపంలోని జాతీయ రహదారి వెంబడి ముళ్లపదల్లో గురువారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. మృతుడి ఒంటిపై ఎలాంటి గాయాలు లేనట్లు మృతుడు అనారోగ్యంతోనే చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి సుమారు 60 సంవత్సరాలు వయసు కలిగి స్కై బ్లూ షర్టు, గల్లలుంగి ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పంచనామ నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు.

దళితుల భూమిని ఆక్రమించుకుంటున్నారు రక్షణ కల్పించండి

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి : బైరెడ్డిపల్లి మండలం ఆకుల కొత్తూరు గ్రామానికి చెందిన దళితుల భూములను కొందరు బెదిరించి ఆక్రమించుకుంటున్నారని బాధితులు తెలియజేశారు. బైరెడ్డిపల్లి మండలం ఆకుల కొత్తూరు గ్రామానికి చెందిన మోహన్ బాబు, భవానిలు తెలిపిన వివరాల మేరకు ఆకుల కొత్తూరు గ్రామం వద్ద సర్వే నెంబర్ 962/3బి లో 0.60 సెంట్ల భూమి గత 80 సంవత్సరాల నుండి తన తండ్రి చిన్న గంగప్ప,చెట్టు, పుట్ట , చదును చేసి అందులో పండించిన పంటతో కుటుంబాన్ని పోషించుకునేవాడని, పక్కనే ఉన్న పెద్ద రెడ్డప్ప రెడ్డి, కళావతి, స్వరూప, జయప్రకాశ్ రెడ్డిలు 60 సెంట్లు భూమి తమదేనంటూ దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు ఏ బలం లేదని గుర్తించిన అగ్ర కులస్తులు మండలంలో అధికార పార్టీకి చెందిన ప్రముఖ వ్యక్తి పేరు చెప్పుకొని భయభ్రాంతులకు గురి చేయడంతో పాటు పోలీసుల చేత తప్పుడు కేసులు పెట్టిస్తానని, బెదిరిస్తున్నారని, ప్రభుత్వం పేదలకు మంజూరు చేస్తున్న ఇల్లు, సంక్షేమ పథకాలు సైతం తమకు దక్క కుండా రద్దు చేయిస్తున్నారని వాపోయారు.ఈ విషయంపై చిత్తూరు కలెక్టరేట్లో జరిగే పి జి ఆర్ ఎస్ లో అర్జీ ఇచ్చామని, మండల రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి 60 సెంట్లు భూమిలో తామే సాగు చేసుకుంటున్నామని, ఎండార్స్ ద్వారా తెలియపరచారని వివరించారు. తమ పొలములో ఏదైనా పంట చేయాలని ట్రాక్టర్లను పిలిచినా వారిని బెదిరించి వెనక్కి పంపుతున్నారని వాపోయారు. ఆ భూమిలో ప్రభుత్వం గతంలో మంజూరు చేసిన సి.ఐ.వెఎల్ బావిని తవ్వామన్నారు.ప్రస్తుతం డీకేటి భూములకు పట్టాలు ఇచ్చే ఆర్డర్లు లేవని ప్రభుత్వం అనుమతిస్తే పట్టా ఇస్తామని రెవిన్యూ అధికారులు తెలిపారన్నారు. పైన తెలిపిన వారినుండి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని, సంబంధిత మండల తహసిల్దార్ వారికి ఫిర్యాదు చేసినట్లు తెలియజేశారు.

స్టోరేజ్ రిజర్వాయర్ నీటి ట్యాంకులను పరిశీలించిన ప్రత్యేక అధికారి జెడి మురళీకృష్ణ

విశాలాంధ్ర-పెద్దపంజాణి: మండలంలోని బొమ్మరాజుపల్లె, అమ్మరాజుపల్లె, బండర్లపల్లె మరియు గొనుమకులపల్లె గ్రామాలలో ఉన్న ఓహెచ్ఎస్ఆర్ ఓవర్ హెడ్ స్టోరేజ్ రిజర్వాయర్ నీటి ట్యాంకులను మండల ప్రత్యేక అధికారి జేడీ అగ్రికల్చర్ మురళీకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో నీటి సరఫరా పరిస్థితులను సమీక్షించడంతో పాటు, ట్యాంకుల పరిసరాలలో పరిశుభ్రత, మురుగు నీటి నిల్వ లేకుండా ఉండే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. అదేవిధంగా, నీటి ట్యాంకుల శుభ్రత మరియు నీటి నమూనాల పరీక్షల రిజిస్టర్లను పరిశీలించారు. ప్రజలకు ఆరోగ్యకరమైన తాగునీరు నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ హేమలత, పంచాయతీ కార్యదర్శులు నిరోష, వాణి మరియు ఇంజనీరింగ్ అసిస్టెంట్ మురళి పాల్గొన్నారు.

శ్రీసాయి సుధా హాస్పిటల్‌లో ఉచిత బిఎండి పరీక్షలు

విశాలాంధ్ర-తిరుపతి: స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని శ్రీ సాయి సుధా మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో గురువారం 9.30 నుంచి మధ్యాహ్నం 2.0 వరకు ఉచిత బియండి పరీక్షలు నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో ప్రముఖ ఎముకలు, కీళ్లు నరముల వైద్య నిపుణులు డాక్టర్ బి. సుకుమార్ ఇంటస్ ఫార్మా లిమిటెడ్ కంపెనీ ముంబయి వారిచే ఉచిత పరీక్షలు చేయడంతో పాటు సలహాలు సూచనలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ సుకుమార్ మాట్లాడుతూ 45 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరు ఎముకల సాంద్రత పరీక్షించుకోవాలని, ఎముకల సాంద్రత పరీక్షలు ప్రతి 3 నెలలకు ఒకసారి ఎముకల వైద్యుల్ని కలిసి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలన్నారు.ఎక్సరే బోన్ డెన్సిటీ టెస్ట్ పరీక్షలతో ఎముకల సాంద్రతను తెలుసుకొని క్యాల్షియం పరిమాణాన్ని సాధ్యమైనంతవరకు ఆహారం ద్వారానే భర్తీ చేసుకోవాలన్నారు.40 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరిలో ఎముకల సాంద్రత తగ్గడంలో అనుకూలత, ఎముకలకు సంబంధించిన సమస్యలు తలెత్తకుండా పరీక్షలు నిర్వహించి వారిలోని ఎముకల సాంద్రతను తెలుసుకొని తగిన నివారణ చర్యలను

తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. డాక్టర్ సుబ్బా నాయుడు, డాక్టర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ ఎముకలలో కాల్షియం తగడం వల్ల వచ్చే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేసారు.ఈ వైద్య శిబిరంలో సుమారు 50 మందికి పైగా పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బా నాయుడు, డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ హిమబిందు, ఫిజియోథెరపీ డాక్టర్ సునీత, సుజాత, మహేష్, శీను, హేమంత్,గౌతమ్, ప్రవీణ్, సిస్టర్స్ సంధ్య, సింధ్య,శ్రీలత, ఇంటస్ ఫార్మా కంపెనీ ప్రతినిధి శ్రీనాధ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో మంత్రి అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు గురువారం కుటుంబంతో కలిసి దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రవేశం వద్దకు చేరుకున్న మంత్రికి జేఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో కె.వి. మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో హరేంద్రనాథ్, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, సూపరింటెండెంట్ రమేష్, ఇన్స్పెక్టర్లు ప్రసాద్, సుబ్బరాయుడు, చలపతి, సుభాస్కర్ నాయుడు, ఆలయ అర్చకులు సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. తదుపరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కల్పవృక్ష వాహనంలో శ్రీ కృష్ణ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారిని మంత్రి దర్శించుకున్నారు. అనంతరం కుంకుమార్చన సేవలో పాల్గొన్న ఆయనకు ఆలయాధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ముక్కంటి చైర్మన్, సభ్యులకు ఘన సన్మానం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ కొట్టేసాయి, సభ్యులను పల్లమాల సుధాకర్ ఘనంగా సత్కరించారు. గురువారం ముక్కంటి ఆలయ పరిపాలన భవనంలో చైర్మన్ కొట్టే సాయి, సభ్యులు దండి రాఘవయ్య, కోలా వైశాలి, పగడాల మురళి, గోపీనాథ్, రుద్రాక్షల కౌసల్యమ్మను కలిసి పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల మెరుగుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రంమలో జైబాబు, పగడాల ప్రతాప్, పగడాల సుధాకర్, ఉత్తరాది రాధాకష్ణ, రూట్. చంద్రశేఖర్ పసుపులేటి నవీన్, ముచ్చేలి నారాయణ,సిద్దులు ప్రసాద్, శ్రీ పురం సుధాకర్, మైసూరు కవిత, కంధాడు సుధాకర్, గుళ్లూరు ధాము రాయల్, ఈగ బాలాజీ, గుళ్లూరు మేఘవర్ణం, కొట్టే శరవణ, సాగి సతీష్, బొక్కిసం ముని సుబ్బయ్య, ఉప్పు కష్ణయ్య, కొన్నలి రమేష్, బ్యాంకు వెంకటేశ్వరులు గోపి, కిషోర్, నరేంద్ర, ప్రసాద్, ఓలా బాబు, నరసయ్య, చందలూరు సుధాకర్, బాలాజీ పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-వి.కోట: గ్రంథాలయ 58వ వారోత్సవాలు గురువారంతో ముగిసాయి. వారం రోజులుగా గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్, పద్యాలు, క్విజ్ మ్యూజికల్ చైర్స్ లాంటి పోటీలు నిర్వహించారు. వీటిలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ముగింపు సందర్భంగా బహుమతులు ప్రశంసాపత్రాలను కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలుగుదేశం పార్టీ వి కోట మండల అధ్యక్షులు రాంబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు వెళ్లే అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయాలలో దొరికే మంచి మంచి పుస్తకాలను చదివ్నినాన్ని పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ధీరజ్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు టి మంజుల రమేష్, కిశోర్, మోహన్, కళా భారతి ఫౌండేషన్ అధ్యక్షులు డా.వి రఘుపతి, గ్రంథాలయ అధికారి మొహమ్మద్ వహబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై

మురళీకృష్ణ అలంకారంలో అమ్మవారు

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన గురువారం ఉదయం కల్పవృక్ష వాహనంపై శ్రీ మురళీకృష్ణ అలంకారంలో శ్రీ పద్మావతి అమ్మవారు భక్తులను కటాక్షించారు. పాలకడలిని అమృతం కోసం మథించిన వేళ లక్ష్మీదేవికి తోబుట్టువైంది కల్పవృక్షం. ఆకలిదప్పుల్ని తొలగించి, పూర్వ జన్మస్మరణను ప్రసాదించే ఈ ఉదార దేవతావృక్షం అన్ని కోరికలనూ తీరుస్తుంది. ఖడ్గాన్ని, యోగదండాన్ని ధరించే గోపకిశోరుడిలా గోసంపదను పరిరక్షించే మంగళదేవత అలమేలుమంగ. మంగమ్మ పాదాలు కల్పతరువు చిగురును తలపిస్తున్నాయని అన్నమయ్య కీర్తించాడు. కోర్కెలను ఈడేర్చే కల్పవృక్షంపై విహరిస్తున్న అలమేలుమంగ ఆశ్రితభక్తులకు లేముల్ని తొలగించే పరిపూర్ణశక్తి. వాహనసేవలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వి.వీరబ్రహ్మం, సివిఎస్వో కేవి.మురళీకృష్ణ, ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, అర్చకులు బాబుస్వామి, అర్చకులు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఘన స్వాగతం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తిరుమల శ్రీవారి దర్శనం కోసం విచ్చేసిన భారత రాష్ట్ర పతి ద్రౌపది ముర్ముకు గురువారం రేణిగుంట విమానాశ్రయంలో రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనితతో కలసి శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ద్రౌపది ముర్ముకు ఆయన పుష్పగుచ్ఛంతో పాటు శ్రీకాళహస్తి కలంకారీతో తయారు చేసిన చీర అందచేశారు.

అమ్మవారికి 8 గొడుగులు విరాళం

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా చెన్నై తిరునిన్రావూరు శ్రీ భాష్యకర కైంకర్య ట్రస్ట్ ప్రతినిధులు అమ్మవారికి ఎనిమిది గొడుగులను విరాళంగా సమర్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు గొడుగులను ప్రదక్షిణగా ఆలయానికి తీసుకువచ్చి, ఆలయ డిప్యూటీ ఈవో హరేంద్రనాథ్, సూపరింటెండెంట్ రమేష్, ఇన్స్పెక్టర్లు సుభాస్కర్ నాయుడు, ప్రసాద్‌లకు ఘనంగా అందజేశారు.

వృత్తి వైద్యం.. ప్రవృత్తి పాడి సేద్యం...

డిగ్రీలు చేసినా ఉపాధి పొందలేని నేటి యువతకు డా. ఆర్.కె.రావు ఆదర్శం

విశాలాంధ్ర-వి.కోట: మండల కేంద్రంలోని కే.జి.ఎఫ్ రోడ్డులో వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఉన్న ఆర్కే మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ద్వారా గుండె సంబంధిత వ్యాధుల నిపుణులుగా మండలంతో పాటు అన్ని ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలందిస్తూ అందరికీ సురిచితులైన డా. ఆర్.కే. రావు కేవలం వైద్య సేవలతోనే కాక పాడి పరిశ్రమ ఏర్పాటు చేసి అధిక మొత్తంలో పాలను ఉత్పత్తి చేస్తూ అదనపు ఆదాయాన్ని పొందడంలో ఓ ప్రత్యేకతగా నిలిచారు. తద్వారా నేటి యువతకు స్వయం ఉపాధికి మార్గదర్శిగా నిలిచారు. ఎంతో మంది యువతీ యువకులు డిగ్రీలు చేసి ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని గ్రామాల్లో మీకు అందుబాటు లో ఉన్న పంట పొలాల్లోనే పాడి పరిశ్రమ ఏర్పాటు చేసుకొని నెలకు లక్షలు సంపాదించడంతో పాటు మీరే మరొకరికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని యువత ను సూచిస్తున్నారు. అందుకు చక్కటి ఉదాహరణగా రాయలసీమ ప్రాంతంలోనే ఎక్కడా లేని విధంగా మండల కేంద్రంలోని ముదిమడుగు ప్రాంతంలో 2022 లో కొన్ని పాడి ఆవులతో ప్రారంభించిన పాల ఉత్పత్తి కేంద్రం దినదినాభివృద్ధి చెంది ప్రస్తుతం సుమారు రెండు వందల పాడి ఆవులతో పాల ఉత్పత్తి పరిశ్రమగా మార్చి నిర్వహిస్తున్నారు. తద్వారా ఉదయం 500 వందల లీటర్లు సాయంత్రం 500 వందల లీటర్ల పాలను సేకరించి డైరీలకు నేరుగా సరఫరా చేస్తున్నారు. తన పాడి పరిశ్రమ నిర్వహణ కోసం సుమారు 25 మందికి పైగా ఉపాధి మార్గం చూపించారు. చదువు ఉండి చక్కటి అవకాశం ఉంటే మరొకరి దగ్గర పనిచేసే కంటే తనకు తాను పని కల్పించుకొని మరెంతో మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేలా పాడి పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకుంటున్న వారికి ఆదర్శంగా నిలిచారు. నిత్యం వైద్య వృత్తి లో బిజీగా ఉండే వైద్యుడు పాడి పరిశ్రమ ను ప్రారంభించి విజయాలు బాట పట్టడంపై పలువురు ఔరా... అంటూ ప్రశంశిస్తున్నారు. అంతేకాక తనకున్న అవకాశాల మేరకు కుప్పం ప్రాంతంలో ఓ రెస్టారెంట్ అండ్ రెశసిడెన్సీని ప్రారంభించి అక్కడా కూడా ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. ఆ వ్యాపారం లోనూ విజయం సాధించిన డా. ఆర్.కే.రావు ఓ సామాన్య రైతు కుటుంబం లో జన్మించిన వ్యక్తి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్య నభ్యసించారు. పట్టుదలతో ఎం.బి.బి.ఎస్, తర్వాత పీజీ పూర్తి చేశారు. అనంతరం గుండె సంబంధిత వ్యాధులకు చికిత్సలు చేసేందుకు కుప్పం పిఇఎస్ మెడికల్ కళాశాల లోనూ అలాగే బెంగళూరు నారాయణ హృదయాలయంలోనూ పనిచేసిన అనుభవం గడించారు. ప్రస్తుతం వి. కోటలో ఆర్.కే. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను ప్రారంభించి వైద్య సేవలందిస్తున్నారు.